చెత్తకుప్పలు..
ప్రజలకు తిప్పలు..







కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in






## పాక్షిక చంద్రగ్రహణం..

జిల్లాలో చంద్రగ్రహణాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మంగళవారం సాయంత్రం కొద్దిసేపు మాత్రమే గ్రహణం కనిపించింది. సాయంత్రం 6.33 గంటల నుంచి 6.40 మధ్య ఏర్పడిన పాక్షిక చంద్రగ్రహణాన్ని ప్రజలు తిలకించారు. ప్రజలు ఈ అరుదైన దృశ్యాలను తమ మొబైల్‌ఫోన్లలో బంధించారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్





నిజామాబాద్ నగరంలో హోలీ వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న యువతి



నగరంలోని కాకతీయ కళాశాల హాస్టల్‌లో హోలీ సంబరాలు

# హోలీ.. రంగుల కేళీ..

### ఉమ్మడి జిల్లాలో ఘనంగా వేడుకలు





హోలీ సంబరం అంబరాన్నంటింది.. ఊరూవాడా చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ రంగుల కేళీలో మునిగితేలారు. ముఖ్యంగా యువతీయువకులు డీజే పాటల హోరులో స్టెప్పులేస్తూ.. ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సోమవారం కామదహనం నిర్వహించగా.. మంగళవారం హోలీ నిర్వహించారు. కొన్ని కళాశాలల్లో హోలీ సంబురాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా యువతీయువకులు సందడి చేశారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



నిజామాబాద్ నగరంలోని ఐటీఐ గ్రౌండ్‌లో..




నిజామాబాద్ నగరంలోని అశోక టవర్స్ వద్ద..



కామారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయంలో..



నిజామాబాద్ నగరంలో..



కొడుకుతో హోలీ ఆడుతున్న కామారెడ్డి ఎస్పీ దంపతులు..

## సీఎం సమావేశానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరటుడే, ఇందూరు:** సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. ప్రధానంగా ఈనెల 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు.. 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ' కార్యక్రమం, అలాగే ఇతర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.

## ఫోర్జరీ చేసి సొసైటీ పేరును మార్చారు.. సీపీకి మాణిక్ భవన్ కమిటీ ఫిర్యాదు

**అక్షరటుడే, ఇందూరు:** చిట్టిమిల హరిప్రసాద్ జూనియర్ కళాశాల పేరును ఫోర్జరీ చేసి సభ్యుల అనుమతి లేకుండా పేరు మార్చిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని శ్రీ నూతన వైశ్య పాఠశాల కమిటీ సభ్యులు కోరారు. ఫోర్జరీపై పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. చిట్టిమిల హరిప్రసాద్ జూనియర్ కళాశాలను నడపడానికి 2021లో ఎథికెన్ ఎడ్యుకేషన్ సొసైటీకి అప్పజెప్పామన్నారు. ఎటువంటి పేరు మార్పులు లేకుండా కొనసాగించాలని సూచించామన్నారు. అయితే తమకు తెలియకుండా తమ సంతకాలను ఫోర్జరీ చేసి, తమ లెటర్ హెడ్‌ను దుర్వినియోగం చేసి షాహిద్ జూనియర్ కళాశాలగా మార్చారన్నారు. చట్ట విరుద్ధంగా చేసిన ఈ అంశాన్ని పరిశీలించి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. పలువురికి గాయాలు



**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డుపై ఓవర్‌టేక్ చేస్తూ వెళ్తున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటన సదాశివనగర్ మండలం మర్కల్ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు నిజామాబాద్ నుంచి కామారెడ్డి వస్తోంది. సదాశివనగర్ మండలం మర్కల్ శివారులో బస్సు వెనకాల ఉన్న లారీ రెండుసార్లు బస్సును ఓవర్ టేక్ చేసింది. ఈ క్రమంలో బస్సును తాకుతూ లారీ వెళ్లింది. దీంతో డ్రైవర్ వైపు బస్సు ముందుబాగం పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 13 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో కామారెడ్డి జీజీహెచ్ కు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 26 మంది ఉన్నట్టుగా సమాచారం.

## పార్సిల్ మిస్సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** తాము పంపిన పార్సిళ్లను కొరియర్ సర్వీస్ సిబ్బంది తారుమారు చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం రెండో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక రెండో టౌన్‌లో ఫిర్యాదు అందించిన అనంతరం బాధితుడు కెతావత్ వెంకట రాములు మాట్లాడుతూ.. గతనెల 12న ఖలీల్ వాడిలోని ఓ ప్రైవేట్ కొరియర్ ద్వారా తాను పార్శిల్ పంపానన్నారు. అందులో నాలుగు ట్యాబ్‌లు ప్యాకింగ్ చేసి కొరియర్ యజమానికి అందజేశామన్నారు. అయితే పార్సిల్ చేరాల్సి స్థలానికి వెళ్లలేదన్నారు. అయితే తాము విచారిస్తే సదరు కొరియర్ సిబ్బంది తన పార్సిల్‌ను మిస్‌ప్లేస్ చేసినట్లు తెలిసిందన్నారు. ఈ విషయమై హైదరాబాద్‌లోని సదరు కొరియర్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదిస్తే సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని రెండో టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## కౌన్సిలర్‌గా చైర్‌పర్సన్ ఉమారాణి ఎన్నిక చెల్లదు..

### కోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ అభ్యర్థి

**అక్షరటుడే, కామారెడ్డి:** కౌన్సిలర్‌గా గెలిచి మున్సిపల్ చైర్‌పర్సన్ అయిన ఇప్ప ఉమారాణి ఎన్నిక చెల్లదంటూ ప్రత్యర్థి అభ్యర్థి కోర్టును ఆశ్రయించారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 39 వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి రంగ మాధవి, స్వతంత్ర అభ్యర్థిగా ఉమారాణి పోటీ చేశారు. గత నెల 11న ఎన్నికలు జరగగా 11న ఓట్ల లెక్కింపు చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి రంగ మాధవిపై స్వతంత్ర అభ్యర్థి ఉమారాణి కేవలం 3 ఓట్ల తేడాతో గెలుపొందారు. రీ కౌంటింగ్ చేసినా అవే ఫలితాలు వచ్చాయి. దాంతో ఉమారాణి గెలుపొందినట్టుగా ఎన్నికల అధికారి ప్రకటించారు. ఆ తర్వాత 16న అనూహ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి ఉమారాణికి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అయితే మంగళవారం ఓటమి చెందిన అభ్యర్థి రంగ మాధవి గెలుపొందిన ఇప్ప ఉమారాణి ఎన్నిక చెల్లదంటూ కామారెడ్డి కోర్టును ఆశ్రయించారు. ఈ విషయమై రంగ మాధవిని ఫోన్ ద్వారా సంప్రదించగా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం నిజమేనన్నారు. తమ పిటిషన్‌ను కోర్టు స్వీకరించిందని, వచ్చే నెల 6 న విచారణ కొనసాగనున్నట్లు తెలిపారు.

శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో..



# గ్రహణం ఎఫెక్ట్.. ఆలయాల మూసివేత

**అక్షరటుడే, ఇందూరు/భిక్కనూరు:** చంద్రగ్రహణం కారణంగా ఉమ్మడి జిల్లాలోని ఆలయాలను మూసివేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం గ్రహణ కాలంలో ఆలయాలను మూసివేశారు. నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వరాలయం, రామాలయం, శంభులింగేశ్వరాలయంతో పాటు ఇతర ఆలయాలు, ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయం, అలాగే కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు సిద్ధ రామేశ్వరాలయంతో పాటు ఇతర ఆలయాలను మూసి ఉంచారు. గ్రహణం వీడిన తర్వాత వాటిని సంప్రోక్షణ చేసి తిరిగి భక్తులకు దర్శనం కల్పించారు.



భిక్కనూరులోని సిద్ధరామేశ్వరాలయంలో..



ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయం..

**బాన్సువాడ పట్టణంలో పారిశుధ్య సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. పట్టణ ప్రవేశ ద్వారం వద్దే చెత్త కుప్పలు వాహనదారులకు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పల కారణంగా విపరీతమైన దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త సేకరణ రోజూ జరుగుతుందని అధికారులు చెబుతున్నప్పటికీ.. అనేక కాలనీలు, వీధుల్లో మాత్రం పరిస్థితి అధ్వానంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.**

**– అక్షరటుడే, బాన్సువాడ**



# చెత్తకుప్పలు.. ప్రజలకు తిప్పలు..

■ బాన్సువాడ బల్దియాలో అస్తవ్యస్త పరిస్థితి ■ దుర్వాసనతో అవస్థలు

పట్టణంలో 19 వార్డులున్నాయి. సుమారు 35వేల వరకు జనాభా ఉంది. 2018లో ఉమ్మడి జిల్లాలో మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. అయితే బాన్సువాడ - బోధన్ జాతీయ రహదారి పక్కనే చెత్తను పడేయడంతో ప్రయాణికులకు అసౌకర్యం కలగడమే కాకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కల్కిచెరువు కట్టపై చెత్త వేయడంతో పందులు, కుక్కలకు ఆవాసంగా మారి ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాపిస్తోంది. చెరువు పరిసర ప్రాంతానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. కొంతమంది ప్రజలు ఇంటి చెత్తను నేరుగా వీధుల్లో పడేస్తుండడం సమస్యను మరింత తీవ్రం చేస్తోంది.

### మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

పట్టణంలో పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు సమగ్ర చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని కాలనీల్లో చెత్తను తొలగించకపోవడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చెత్తను తొలగింపజేస్తాం..

బాన్సువాడ - బోధన్ జాతీయ రహదారి పక్కన పట్టణ ముఖద్వారం వద్ద ఉన్న చెత్త సోమేశ్వర్ గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది. కల్కి చెరువు, ఇతర కాలనీల్లో ఉన్న చెత్తను సిబ్బందిని పంపించి తొలగిస్తాం.

– శ్రీహరి రాజు,
మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

# పీసీసీ చీఫ్‌ను కలిసిన కౌన్సిలర్ దంపతులు



**అక్షరటుడే, భీమ్‌గల్:** మున్సిపల్ ఎన్నికల్లో ఒకటో వార్డు నుంచి విజయం సాధించిన ఆరేపల్లి నాగేంద్రబాబు శ్రీజ దంపతులు పలువురు రాష్ట్రస్థాయి నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కో-ఆపరేటివ్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ విజయం కోసం సహకరించిన నేతలకు ధన్యవాదాలు తెలపడంతో పాటు, వార్డు అభివృద్ధికి వారి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# కామదహనంలో వివాదం.. ఇరువర్గాల దాడి

**అక్షరటుడే, కామారెడ్డి:** కామదహనం చేస్తుండగా అందులో చెప్పులు నింపిన సంచి వేసిన ఘటన రెండు వర్గాలు దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలోని ఓ కాలనీలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని ఓ కాలనీలో సోమవారం రాత్రి కామదహనం చేస్తుండగా ఓ వ్యక్తి చెప్పులు నింపిన సంచిని అందులో పడేశాడు. అయితే ఆ సంచిలో ఏమున్నాయని అక్కడున్న మహిళలు ప్రశ్నించగా కావాలనే చెప్పులు వేశానని సమాధానం చెప్పాడు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగిందని తెలిసింది. స్థానిక ప్రజాప్రతినిధి ఇరువర్గాలను సముదాయిస్తున్న సమయంలో మహిళా సంఘం సభ్యురాలిపై చెప్పులు వేసిన వ్యక్తికి సంబంధించిన ఇద్దరు మహిళలు దాడికి పాల్పడ్డారు. దాడిలో తీవ్రంగా గాయపడిన మహిళా సంఘం సభ్యురాలిని జీజీహెచ్‌కు తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్‌రావుపై ఫిర్యాదు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఏఆర్ కానిస్టేబుల్‌పై నందిపేట్ మండలం లక్కంపల్లి గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీపీ సాయిచైతన్యకు మంగళవారం ఫిర్యాదు కాపీని అందజేశారు. ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్‌రావు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే.. ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటున్నారని గ్రామ ప్రజలు ఆరోపించారు. గ్రామంలో తగాదాలు సృష్టిస్తున్నాడని వారు వివరించారు. గతంలో సదరు కానిస్టేబుల్‌పై పలు కేసులు సైతం ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీని కలిసిన వారిలో లక్కంపల్లి సర్పంచ్ సంతోష్ గౌడ్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# కోమట్‌పల్లిలో విషాదం.. చెరువులో పడి యువకుడు మృతి



**అక్షరటుడే, లింగంపేట:** చెరువులో పడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన లింగం పేట మండలం కోమట్‌పల్లిలో చోటు చేసుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లింగంపేట ఎస్సై దీపక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోమట్‌పల్లి గ్రామానికి చెందిన ధరణి సాయవ్వ తన కుమారుడు నవీన్ (18)తో కలిసి నివాసం ఉంటోంది. నవీన్ తండ్రి పదకొండేళ్ల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దీంతో తల్లి సాయవ్వ నవీన్ అల్లారుముద్దుగా పెంచుకుంది. అయితే సోమవారం కామారెడ్డికి పనినిమిత్తం వెళ్లిన సాయవ్వ ఇంటికి తిరిగి వచ్చేసరికి కుమారుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించింది. కోమటిపల్లి చెరువు కట్టపై కుమారుడి చెప్పులు కనపడడంతో చెరువులో గాలించగా మృతదేహం లభించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్వప్న వివరాలు వెల్లడించారు. నగరంలోని ముస్తాయిద్ పురా కాలనీలో ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ కైసర్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 1.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అబ్దుల్ కైసర్‌ను కోర్టులో హాజరు పర్చామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై మల్లేష్, సిబ్బంది సునీల్, మోహన్ సింగ్, ధరిసింగ్, రవి, షబ్బీర్, సంజయ్, ప్రభాకర్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.


# హోలీ.. రంగుల కేళీ..



ఆర్మూర్‌లో..



ఆర్మూర్‌లోని బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో..



ఆర్మూర్ హౌసింగ్ బోర్డు పార్క్ వాకర్స్ ఆధ్వర్యంలో..



ఆర్మూర్ పట్టణంలో..




బాన్సువాడలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో..



చంద్రానగర్‌లో..



గాంధారి మండల కేంద్రంలో..



పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో..



కామారెడ్డి కాసర్ల విహార్ ఫేజ్–2లో..



నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో..



నిజామాబాద్ నగరంలో..




తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..



ఆర్మూర్ తపస్ ఆధ్వర్యంలో...